# ముందు క్షమాపణ చెప్పండి

**కర్నల్ సోఫియాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ మంత్రిపై సుప్రీం ఆగ్రహం**


విజయ్ షా

న్యూఢిల్లీ, మే 15: భారతీయ మహిళా సైనికాధికారి కర్నల్ సోఫియా ఖురేషీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్‌కు చెందిన బీజేపీ మంత్రి విజయ్ షాను సుప్రీంకోర్టు గురువారం తీవ్రంగా మందలించింది. మంత్రి వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కావని, సున్నితత్వం లోపించిందని భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) బీఆర్ గవాయ్ మండిపడ్డారు. రాజ్యాంగపరమైన పదవుల్లో ఉన్న వారు తమ మాటల్లో సంయమనం పాటించాలని హితవు చెప్పారు. 'ఎటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారు? కొంచెమన్నా సున్నితత్వం ఉండాలి. ముందు వెళ్లి హైకోర్టుకు క్షమాపణ చెప్పండి' అంటూ గవాయ్ ఆదేశించారు. కర్నల్ సోఫియా ఖురేషీపై మంత్రి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను ప్రతిపక్షంతోపాటు మాజీ సైనికాధికారులుసైతం ఖండించారు. విజయ్ షాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మధ్యప్రదేశ్ హైకోర్టు బుధవారం పోలీసులను ఆదేశించడంలో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గురువారం ఈ పిటిషన్ విచారణకు రాగా అరెస్టు నుంచి మధ్యంతర రక్షణ ఇవ్వడానికి సీజేఐ గవాయ్ నిరాకరించారు.

## తుర్కియే సంస్థ 'సెలెబీ'పై వేటు

**సెక్యూరిటీ క్లియరెన్స్ రద్దుచేసిన బీసీఏఎస్**

న్యూఢిల్లీ, మే 15: ఢిల్లీ, ముంబైతో పాటు దేశంలోని వివిధ విమానాశ్రయాల్లో గ్రౌండ్ హ్యాండ్లింగ్, భద్రతాపరమైన, ఇతర విధులు నిర్వహిస్తున్న తుర్కియేకు చెందిన సెలెబీ ఎయిర్‌పోర్టు సర్వీసెస్ సంస్థకు కేంద్ర ప్రభుత్వం భద్రతా అనుమతిని రద్దు చేసింది. ఈ నిర్ణయం తక్షణం అమలులోకి వస్తుందని బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) జాయింట్ డైరెక్టర్ సునీల్ యాదవ్ ఆదేశాలు జారీ చేశారు. దేశ భద్రతా కారణాలతోఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. సెలెబీ దేశంలోని ఢిల్లీ, ముంబైతో పాటు హైదరాబాద్, కొచ్చి, చెన్నై ఎయిర్‌పోర్టులలో గ్రౌండ్ హ్యాండ్లింగ్, కార్గో, గ్రౌండ్ ఆపరేషన్ వంటి ముఖ్యమైన కార్యకలాపాలు నిర్వహిస్తున్నది.

## పాక్‌లో అణు రేడియేషన్ లీక్ కాలేదు

**అంతర్జాతీయ అణుశక్తి సంస్థ**

న్యూఢిల్లీ, మే 15: భారత్ సైన్యం దాడుల అనంతరం పాకిస్థాన్‌లోని ఏ అణుకేంద్రం నుంచి కూడా రేడియేషన్ లీక్ కాలేదని గ్లోబల్ న్యూక్లియర్ వాచ్‌డాగ్‌గా వ్యవహరించే అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ) గురువారం వెల్లడించింది. భారత బలగాలు పాక్‌లోని అణు స్థావరాలపై దాడి చేశాయని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఐఏఈఏ స్పందించింది. ఈ సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ పాకిస్థాన్‌లో ఎలాంటి అణు రేడియేషన్ లీకులు లేవని తెలిపారు. అంతకుముందు భారత వైమానిక దళ డీజీఏవో, ఎయిర్ మార్షల్ ఏకే భారతి 12న నిర్వహించిన మీడియా సమావేశంలో కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరించారు. పాకిస్థాన్ అణు నిల్వలు ఉన్న కిరానా హిల్స్‌పై దాడి వదంతులను ఖండించారు.

## తుర్కియేతో మనూ వర్సిటీ ఒప్పందం రద్దు

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): భారత్‌తో యుద్ధంలో పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచిన తుర్కియేపై దేశ వ్యాప్తంగా బహిష్కరణల పర్వం కొనసాగుతున్నది. తాజాగా మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మనూ) కూడాతుర్కియేతో ఒప్పందాన్ని రద్దు చేసుకున్నది. ఈ మేరకు యూనివర్సిటీ గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. తుర్కిష్ భాషలో డిప్లొమా కోర్సును ప్రారంభించిన మనూ యూనివర్సిటీ ఇందుకు సహాయం కోసం తుర్కియేలోని యూనుస్ ఎమ్రీ ఇన్‌స్టిట్యూట్‌తో నిరుడు జనవరి 2వ తేదీన ఒప్పందం చేసుకున్నది.

**జామియా వర్సిటీ కూడా..**

తుర్కియే ప్రభుత్వంతో అనుబంధం గల సంస్థలతో చేసుకున్న అన్ని అవగాహన ఒప్పందాలను నిలిపేస్తున్నట్లు జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయం ప్రకటించింది. దేశ భద్రతకు సంబంధించిన కారణాల వల్ల ఈ ఎంవోయూలను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు వివరించింది. ఈ విశ్వవిద్యాలయం దేశానికి గట్టి మద్దతుగా నిలుస్తుందని తెలిపింది.

# భారత్‌పై ట్రంప్ కక్ష!

**అమెరికా అధ్యక్షుడి నిర్ణయాలతో ఇండియాకు ఇబ్బందులు**



- భారత్ నుంచి యాపిల్ వీడేలా టిమ్ కుక్‌పై ఒత్తిళ్లు
- పాక్‌తో అంటకాగుతున్న తుర్కియేకు క్షిపణుల విక్రయానికి గ్రీన్‌సిగ్నల్
- పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌తో ట్రంప్ కుటుంబ సంస్థ క్రిప్టో డీల్

న్యూఢిల్లీ, మే 15: భారత్ మీద అమెరికా కక్ష కట్టినట్టు కనిపిస్తున్నది. ఆ దేశ అధ్యక్షుడి నిర్ణయాలను గమనిస్తే ఇదే అనుమానం కలుగుతుంది. వాణిజ్యం నిలిపివేస్తానని హెచ్చరించి భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణకు తానే ఒప్పించినట్టు ట్రంప్ చేసిన ప్రకటనపై ఇప్పటికే దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. తాజాగా భారత్‌లో యాపిల్ తయారీ ప్లాంట్‌పై ఆయన అక్కసు వెళ్లగక్కారు. యాపిల్ కంపెనీ భారత్‌లో ఐఫోన్లు తయారు చేయడం తనకు ఇష్టం లేదని పేర్కొంటూ.. దేశంలో ఉత్పత్తి కేంద్రాలను విస్తరించకుండా యాపిల్ సీఈవో టిమ్‌కుక్‌పై ఒత్తిళ్లు తెచ్చారు. అలాగే భారత్‌కు వ్యతిరేకంగా పాక్‌కు ఆయుధాలు అందించిన తుర్కియేకు క్షిపణులను విక్రయించేందుకు తాజాగా అమెరికా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు, పహల్గాం ఉగ్రదాడి జరిగిన కొన్ని రోజులకే పాకిస్థాన్‌తో ట్రంప్ కుటుంబ సంస్థ ఒకటి భారీ క్రిప్టో కరెన్సీ డీల్ కుదుర్చుకోవడం గమనార్హం.

**భారత్ నుంచి బయటకు వచ్చేయండి**

యాపిల్ కంపెనీ తన ఉత్పత్తి కేంద్రాలను భారత్‌లో విస్తరించడం తనకు ఇష్టం లేదని ట్రంప్ పేర్కొన్నారు. గల్ఫ్ దేశాల పర్యటనలో ఉన్న ట్రంప్ దోహాలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతూ.. యాపిల్ కంపెనీ సీఈవో టిమ్ కుక్‌తో తనకు చిన్న సమస్య ఎదురైందని అన్నారు. యాపిల్ కంపెనీ ఇండియాలో ఐఫోన్‌లను ఉత్పత్తి చేయడం తనకు ఇష్టం లేదని చెప్పారు. 'నేను కుక్‌తో ఇలా చెప్పాను.. మై ఫ్రెండ్ నేను నిన్ను బాగా చూసుకుంటున్నాను. నీవు 500 బిలియన్ డాలర్లతో వ్యాపారాన్ని విస్తరిస్తున్నావు. నువ్వు ఇండియా అంతటా యూనిట్లు ఏర్పాట్లు చేస్తున్నావని విన్నాను. నువ్వు ఇండియాలో ఉత్పత్తి చేయడం నాకు ఇష్టం లేదు. ఇండియా పట్ల నీకు శ్రద్ధ ఉంటే నువ్వు అక్కడే నీ ఉత్పత్తులు తయారు చేసుకో. కానీ ప్రపంచంలో అత్యధికంగా పన్నులు వేస్తున్న దేశాల్లో ఇండియా ఒకటి, అక్కడ నీ ఉత్పత్తులు అమ్ముకోవడం చాలా కష్టం అని చెప్పాను. చైనాలో ప్లాంట్లు నిర్మించినా ఎన్నో సంవత్సరాలుగా సహిస్తున్నాం. మీరు ఇండియాలో ప్లాంట్లు ఏర్పాటుచేయడంపై మాకు ఆసక్తి లేదు. ఇండియా దాని సంగతి అది చూసుకోగలదు అని చెప్పాను' అని వివరించారు. కుక్‌తో తన సంభాషణ అనంతరం యాపిల్ కంపెనీ అమెరికాలో తన ఉత్పత్తిని మరింత పెంచుతుందని ట్రంప్ చెప్పారు.

**తుర్కియేకు అమెరికా క్షిపణులు**

పాకిస్థాన్‌తో అంటకాగుతున్న తుర్కియేతో అమెరికా భారీ ఆయుధ ఒప్పందం కుదుర్చుకునేందుకు సిద్ధమైంది. గగనతలం నుంచి గగనతలం లక్ష్యాల్ని ఛేదించే 'ఏఐఎం-120సీ' క్షిపణులను తుర్కియేకి అమ్మేందుకు అమెరికా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో, పాక్‌కు మద్దతు పలుకుతున్న తుర్కియేకి అమెరికా నుంచి పెద్ద ఎత్తున క్షిపణులు అందటం గమనార్హం. తుర్కియేతో దాదాపు 225 మిలియన్ డాలర్ల (రూ.1,923 కోట్లు) విలువైన 'ఫారెన్ మిలిటరీ సేల్స్' ఒప్పందాన్ని ఆమోదించాలని అమెరికా హోం శాఖ నిర్ణయించింది.

**ట్రంప్ కుటుంబ సంస్థతో పాక్ డీల్**

ట్రంప్ కుటుంబ సభ్యులకు 60% వాటా ఉన్న వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్(డబ్ల్యూఎల్ఎఫ్)తో పాక్ భారీ క్రిప్టోకరెన్సీ ఒప్పందం కుదుర్చుకుంది. పహల్గాం ఉగ్రదాడి జరిగిన కొన్ని రోజులకే పాకిస్థాన్ క్రిప్టో కౌన్సిల్), డబ్ల్యూఎల్ఎఫ్ మధ్య ఒప్పందం జరిగింది. క్రిప్టో పరిశ్రమలో పెట్టుబడులు, ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ డీల్ కుదిరింది.

**అంతా నేనే చేశానని చెప్పను**

రెండు అణ్వస్త్ర దేశాలైన భారత్, పాక్ మధ్య గత వారం సైనిక ఘర్షణ తలెత్తినపుడు ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ సాధించడంలో తన ప్రత్యక్ష మధ్యవర్తిత్వం ఉన్నట్లు ఇప్పటివరకు ప్రకటిస్తూ వచ్చిన ట్రంప్ గురువారం మాటమార్చారు. ఖతార్‌లోని అల్-ఉదీద్ ఎయిర్ బేస్ వద్ద అమెరికా సైనిక బలగాలను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగిస్తూ 'అంతా నేనే చేశానని చెప్పను. అయితే నా సాయం మాత్రం కచ్చితంగా ఉందని చెప్పగలను' అని వ్యాఖ్యానించారు. 'దాదాపు వెయ్యేండ్ల నుంచి ఆ రెండు దేశాల మధ్య శత్రుత్వం ఉందని నాకు కొందరు చెప్పారు. నేను దాన్ని పరిష్కరించగలను. ముందుగా అందరినీ ఒక చోటుకు తీసుకురానివ్వండి' అని చెప్పిన ట్రంప్ వెంటనే మాట మారుస్తూ 'పరిస్థితి జటిలమైనది. పరిష్కరించగలనని కచ్చితంగా చెప్పలేను. అది చాలా కష్టమైన పని' అని వెల్లడించారు.

### మధ్యవర్తిత్వంపై వైట్‌హౌజ్ ప్రచారం!

భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ క్రెడిట్ దక్కించుకోవడానికి ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు నాలుగైదు సార్లు బహిరంగంగా ప్రకటించుకోగా, దానికి వైట్‌హౌజ్ కూడా విస్తృత ప్రచారం చేస్తున్నది. తాను దోహాకు వెళ్లినప్పుడు బ్రేక్‌ఫాస్ట్ సమయంలో ఓ వెయిటర్ తనను కలిశాడని, యుద్ధం ఆపినందుకు ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలియజేయాలని తనను కోరాడని శ్వేత సౌధ మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ తెలిపారు. ఎందుకు కృతజ్ఞతలు చెప్పాలని తాను ప్రశ్నించగా.. 'మేడం, మాది కశ్మీర్, ఇటీవల రెండు దేశాల మధ్య యుద్ధం వల్ల సొంత ఊరికి వెళ్లలేకపోతున్నాను. యుద్ధం ముగింపునకు ట్రంప్ సార్ చేసిన మేలు మరువలేనిది. సార్‌కు నా కృతజ్ఞతలు చెప్పండి' అని కోరాడని కరోలిన్ ఎక్స్‌లో చెప్పారు.

### అమెరికా ఉత్పత్తులపై భారత్ జీరో టారిఫ్!

అమెరికా ఉత్పత్తులపై భారత్ అన్ని రకాల టారిఫ్‌లను ఎత్తివేస్తామని ప్రకటించిందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం సంచలన ప్రకటన చేశారు. భారత్ తమకు ఒక ఆఫర్ ఇచ్చిందని, టారిఫ్‌లను ఎత్తివేసేందుకు అంగీకరించిందని తెలిపారు. దీనిపై విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ స్పందిస్తూ అమెరికాతో చర్చలు జరుగుతున్నాయని, కానీ ఇంకా దేనిపైనా నిర్ణయం జరుగలేదని స్పష్టం చేశారు. అధికారం చేపట్టిన నాటి నుంచి ట్రంప్ వివిధ దేశాలతో టారిఫ్‌ల విషయంలో దూకుడుగా వ్యవహరిస్తున్నారు. టారిఫ్‌లను 'శూన్యం' స్థాయికి తగ్గించి వేసేందుకు భారత్ అంగీకరించిందని ఈ నెలారంభంలో కూడా ట్రంప్ పేర్కొన్నారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై భారత్‌తో చర్చలు జరుగుతున్నాయని గత నెలలో చెప్పారు. చర్చలు గొప్పగా జరుగుతున్నాయని, త్వరలో భారత్‌తో ఒప్పందం కుదురుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రంప్ తాజా ప్రకటనపై జైశంకర్ స్పందిస్తూ.. భారత్, అమెరికా మధ్య చర్చలు జరుగుతున్నాయని, ఇవి ఎంతో సంక్లిష్టమైనవని పేర్కొన్నారు. చర్చలు పూర్తయ్యే వరకూ ఏదీ నిర్ణయమైనట్టు కాదని స్పష్టం చేశారు. అమెరికాకు చెందిన అనేక ఉత్పత్తులపై భారత్ 'జీరో టారిఫ్'కు అంగీకరించిందన్న ట్రంప్ ప్రకటనపై ప్రధాని మోదీ ఎందుకు స్పందించడం లేదని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది.

## ముగ్గురు ఉగ్రవాదులు హతం

**జమ్ముకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్**

శ్రీనగర్, మే 15: జమ్ముకశ్మీర్‌లో మరో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. పుల్వామా జిల్లాలో భద్రతా బలగాలు గురువారం ఉదయం జరిపిన కాల్పుల్లో ముగ్గురు జైషే మహ్మద్ ఉగ్రవాదులు హతమయ్యారు. అవంతిపొరాలోని నాదర్‌ట్రాల్ ప్రాంతంలో జరిగిన ఈ కాల్పుల్లో మరణించిన మృతులు ముగ్గురూ జైషే మహ్మద్ గ్రూప్‌నకు చెందిన ఆసిఫ్ మహ్మద్ షేక్, అమీర్ నజీర్ వనీ, యావర్ అహ్మద్‌లుగా గుర్తించామని, వీరు పుల్వామ్లాకు చెందిన వారని పోలీసులు తెలిపారు.

**భేటా.. లొంగిపో...**

భద్రతా దళాల కాల్పుల్లో మరణించిన ఉగ్రవాది అమీర్ నజీర్ వనీ ఎన్‌కౌంటర్‌కు ముందు తన తల్లితో వీడియో కాల్ మాట్లాడాడు. వీడియోలో ఏకే 47 గన్‌తో కన్పించిన అమీర్‌ను వెంటనే లొంగిపొమ్మని అతని తల్లి కోరింది. దానికి అతడు నిరాకరించడమే కాక 'సైన్యాన్ని ముందుకు రానీ.. అప్పుడు వారి సంగతి చూస్తాను' అని సమాధానం ఇచ్చి తర్వాత హతమయ్యాడు.

## కళ్లకు గంతలు కట్టి.. నిద్రపోనివ్వకుండా చేసి

**పాక్ చెరలో బీఎస్‌ఎఫ్ జవాన్‌కు వేధింపులు**

న్యూఢిల్లీ: భారతీయ అధికారులకు పాకిస్థాన్ అప్పగించిన బీఎస్‌ఎఫ్ జవాన్ పాకిస్థాన్ కస్టడీలో 21 రోజులు తీవ్ర వేధింపులకు గురైనట్లు వెలుగులోకి వచ్చింది. ఏప్రిల్ 23న పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ సెక్టార్‌లో గల అంతర్జాతీయ సరిహద్దు వద్ద పొరపాటున సరిహద్దులను దాటి పాకిస్థాన్‌లోకి ప్రవేశించిన బీఎస్‌ఎఫ్ జవాన్ పూర్ణం కుమార్ షాను పాక్ రేంజర్లు అరెస్టు చేశారు. షా కళ్లకు గంతలు కట్టి బందీగా ఉంచుకున్న పాకిస్థాన్ అధికారులు ఆయనను నిద్రపోనివ్వకుండా తీవ్ర పదజాలంతో దూషించినట్లు తెలిసింది. పళ్లు తోముకోవడానికి కూడా షాను అనుమతించ లేదు. సరిహద్దుల వెంబడి బీఎస్‌ఎఫ్ స్థావరాల వివరాలు చెప్పాలంటూ ఆయనను పాక్ అధికారులు ప్రశ్నించారని అధికార వర్గాలు తెలిపాయి. పాక్‌లో మూడు గుర్తుతెలియని ప్రదేశాలకు షాను తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.



## అమెరికాలో తెలుగు టెకీ మృతి

- పర్వతారోహణ సమయంలో ప్రమాదం
- విష్ణు ఇరిగిరెడ్డి సహా ముగ్గురి మృతి

న్యూయార్క్: ఉత్తర అమెరికాలోని వాషింగ్టన్ స్టేట్‌లో పర్వతారోహణ చేస్తుండగా తెలుగు టెకీ విష్ణు ఇరిగిరెడ్డి (48) ప్రమాదవశాత్తూ మరణించారు. విష్ణు, మరో ముగ్గురు గ్రానైట్ శిలలతో కూడిన కొండ వంటి ప్రదేశంపైకి ఎక్కుతుండగా తుఫాన్ వచ్చింది. దీంతో వీరంతా తిరిగి కిందికి దిగేందుకు ప్రయత్నించారు. అయితే, యాంకర్ పాయింట్ ఫెయిల్ అవడంతో 200 అడుగుల కిందికి పడిపోయారు. వీరిలో ఒకరు అదృష్టవశాత్తూ తప్పించుకోగా, మిగిలిన ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు. విష్ణుకు పర్వతారోహణ పట్ల మక్కువ ఎక్కువ అని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. సియాటెల్‌లోని టెక్, కల్చరల్ కమ్యూనిటీలో మంచి సభ్యుడని పేర్కొన్నారు. ఆయన గ్రేటర్ సియాటెల్ ఏరియాలోని టెస్ట్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ ఫ్లూక్ కార్పొరేషన్ వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ ఇంజినీరింగ్‌గా పని చేస్తున్నారు. ఆయన అసాధారణ నాయకత్వ లక్షణాలు కలవారని ఆ కంపెనీ పేర్కొంది.

## జూన్ 8న ఐఎస్ఎస్‌కు శుభాన్షు శుక్లా

న్యూఢిల్లీ: భారత వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా సారథ్యంలోని నలుగురు సభ్యులతో కూడిన బృందం యాక్సియామ్-4 (ఏఎక్స్-4) మిషన్ ద్వారా జూన్ 8న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) పయనం కానుంది. నిజానికి వీరు ఈ నెల 29న వెళ్లాల్సి ఉండగా యాత్రను వాయిదా వేస్తున్నట్టు అంతరిక్షయాన సంస్థ యాక్సియామ్ స్పేస్, నాసా సంయుక్తంగా ప్రకటించాయి. భారత కాలమానం ప్రకారం జూన్ 8న సాయంత్రం 6:41 గంటలకు ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి ఈ ప్రయోగం జరుగుతుందని పేర్కొన్నాయి. ఫ్లైట్ షెడ్యూల్‌ను సమీక్షించిన అనంతరం ప్రయోగ తేదీల్లో మార్పులు చేసినట్టు తెలిపాయి.

## సంక్షిప్త వార్తలు

### పాక్‌తో సంబంధాలు ద్వైపాక్షికమే: జైశంకర్

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్‌తో భారత్ సంబంధాలు, వ్యవహారాలు కచ్చితంగా ద్వైపాక్షికంగానే ఉంటాయని భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ స్పష్టం చేశారు. చాలా కాలంగా జాతీయ ఏకాభిప్రాయం మేరకు ఇదే విధానం కొనసాగుతున్నదని, ఇందులో ఎలాంటి మార్పు లేదని ఆయన చెప్పారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కశ్మీర్ విషయానికి వస్తే చర్చించాల్సిన ఏకైక విషయం పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో చట్టవిరుద్ధంగా ఆక్రమించిన భారత భూభాగాన్ని వదిలిపెట్టడమేనని అన్నారు.

### 20 నుంచి కాంగ్రెస్ 'జైహింద్ సభలు'

**న్యూఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాక్ దేశాల మధ్య ఇటీవల సంఘర్షణ కొనసాగుతుండగా, మోదీ ప్రభుత్వం హఠాత్తుగా కాల్పులను ఎందుకు ఆపింది, ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యం, ఆయన ప్రకటనలు తదితర అంశాలపై విపక్ష కాంగ్రెస్ పలు సందేహాలు, అనుమానాలు వ్యక్తం చేస్తున్నది. ఈ క్రమంలో దీనిపై ప్రశ్నించడానికి ఆ పార్టీ ఈ నెల 20 నుంచి 30 వరకు దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో 'జైహింద్ సభలు' నిర్వహించాలని నిర్ణయించింది.

### కేంద్ర కార్మిక సంఘాల సమ్మె వాయిదా

**న్యూఢిల్లీ:** ఈ నెల 20న నిర్వహించాలనుకున్న దేశవ్యాప్త సమ్మెను కేంద్ర కార్మిక సంఘాలు వాయిదా వేశాయి. సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు, ఇండిపెండెంట్ సెక్టోరల్ ఫెడరేషన్లు, అసోసియేషన్ల సంయుక్త వేదిక గురువారం సమావేశమైంది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం దేశంలో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, బాధ్యతాయుతమైన దేశభక్తులుగా సమ్మెను వాయిదా వేయాలని నిర్ణయించినట్లు ఓ ప్రకటనలో తెలిపింది. లేబర్ కోడ్స్ అమలును వ్యతిరేకిస్తూ, కార్మికుల చట్టబద్ధ డిమాండ్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9న సమ్మె చేస్తామని ప్రకటించింది.

### ఇజ్రాయెల్ దాడుల్లో 54 మంది మృతి

**ఖాన్ యూనిస్:** దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ నగరంపై బుధ-గురువారాల మధ్య రాత్రి ఇజ్రాయెల్ నిర్వహించిన దాడుల్లో 54 మంది మరణించారు. ఇజ్రాయెల్ దళాలు పెద్ద ఎత్తున బాంబులను కురిపించడం ఇది వరుసగా రెండో రోజు. మృతుల్లో ఓ పాత్రికేయుని కుటుంబ సభ్యుల్లో 11 మంది కూడా ఉన్నారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఇటీవల మాట్లాడుతూ, హమాస్ ఉగ్రవాద సంస్థను అంతం చేసే వరకు గాజా స్ట్రిప్‌లో యుద్ధం కొనసాగుతుందన్నారు.

### పోక్సో కోర్టుల ఏర్పాటుకు సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ:** బాలలపై లైంగిక నేరాల కేసుల విచారణ కోసం ప్రత్యేక పోక్సో కోర్టులను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. లైంగిక నేరాల నుంచి బాలల పరిరక్షణ (పోక్సో) చట్టం ప్రకారం నమోదయ్యే కేసుల విచారణ పూర్తి కావడానికి ఈ చట్టం నిర్దిష్ట గడువును విధించిందని తెలిపింది. తగినన్ని ప్రత్యేక కోర్టులు లేనందు వల్ల ఈ గడువులోగా విచారణ పూర్తి కావడం లేదని పేర్కొంది. అందువల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోక్సో కేసులపై దర్యాప్తుతో సంబంధం గల అధికారులకు అవగాహన కల్పించడానికి, అత్యధిక ప్రాధాన్యత ప్రాతిపదికపై పోక్సో కేసులను విచారించేందుకు ప్రత్యేక కోర్టుల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరింది.

### చార్‌ధామ్ భక్తుల రాకలో 31 శాతం తగ్గుదల

**డెహ్రాడూన్:** చార్‌ధామ్ యాత్రలో మొదటి రెండు వారాల్లో భక్తుల రాక నిరుటితో పోల్చినపుడు 31 శాతం తగ్గింది. ఈ ఏడాది ఏప్రిల్ 30 నుంచి మే 13 వరకు 6,62,446 మంది గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయాలను సందర్శించారు. నిరుడు ఈ యాత్ర ప్రారంభమైన మే 10 నుంచి మే 23 వరకు 9,61,302 మంది సందర్శించారు. ఎస్‌డీసీ ఫౌండేషన్ అనే సంస్థ ఈ వివరాలను వెల్లడించింది. ఈ సంస్థ చీఫ్ అనూప్ నౌటియాల్ మాట్లాడుతూ, పహల్గాం ఉగ్రదాడి, భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల ప్రభావం భక్తులపై పడిందన్నారు.

# రాష్ట్రపతికి గడువు విధించొచ్చా?

- గవర్నర్‌కు, రాష్ట్రపతికి ఉన్న అధికారాలేంటి?
- మాకు ఆదేశాలు ఇచ్చే అధికారం కోర్టుకు ఉందా?
- బిల్లులపై సుప్రీంకోర్టును ప్రశ్నించిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ, మే 15: రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులపై నిర్ణయాలు తీసుకునే విచక్షణాధికారాల విషయంలో గవర్నర్‌కు, రాష్ట్రపతికి న్యాయస్థానాలు గడువును నిర్దేశించగలవా? అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుప్రీంకోర్టును ప్రశ్నించారు. అత్యంత అరుదుగా ఉపయోగించే రాజ్యాంగంలోని 143(1) అధికరణ కింద తనకు గల ప్రత్యేక అధికారాలను ఉపయోగిస్తూ రాష్ట్రపతి ముర్ము సుప్రీంకోర్టుకు పలు ప్రశ్నలు సంధించారు. చట్టానికి లేదా వాస్తవాలకు సంబంధించి ఏదైనా సందేహం ఏర్పడినపుడు దాన్ని నివృత్తి చేసుకునేందుకు రాష్ట్రపతి ఆర్టికల్ 143(1) కింద సుప్రీంకోర్టును సంప్రదించే అధికారం ఉంది. రాష్ట్రపతి లేవనెత్తిన ప్రశ్నలపై సంప్రదింపులు జరిపిన తర్వాత సుప్రీంకోర్టు తన అభిప్రాయాన్ని రాష్ట్రపతికి తెలియచేసే అవకాశం ఉంటుంది. తమిళనాడు అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలియచేయకుండా కాలయాపన చేయటాన్ని డీఎంకే ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఏప్రిల్ 8న తీర్పు ఇస్తూ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు గవర్నర్లు, రాష్ట్రపతి నిర్ణీత కాల వ్యవధిలోగా ఆమోదం తెలియచేయాలని ఆదేశించింది.



**సుప్రీంకోర్టుకు 14 ప్రశ్నలు**

రాష్ట్రపతికి గడువును నిర్దేశించే అధికారం న్యాయస్థానానికి ఉందా అన్న ప్రశ్నలు లేవనెత్తిన రాష్ట్రపతి ముర్ము 14 ప్రశ్నలను సుప్రీంకోర్టుకు సంధిస్తూ వీటికి సమాధానాలు కోరారు. తన ఐదు పేజీల లేఖలో రాష్ట్రపతి ముర్ము సుప్రీంకోర్టుకు ప్రశ్నలను సంధిస్తూ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు సంబంధించి ఆర్టికల్ 200, 201 కింద గవర్నర్, రాష్ట్రపతికి గల అధికారాలపై అభిప్రాయం తెలియచేయాలని కోరారు. రాష్ట్రపతి పరిశీలన నిమిత్తం గవర్నర్ బిల్లులు నివేదించడం ఆర్టికల్ 201 పరిధిలోకి వస్తుంది. కాగా, సుప్రీం కోర్టు తీర్పుపై సమీక్షను కోరకుండా రాష్ట్రపతికి కేంద్రం నివేదించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. రివ్యూ పిటిషన్లకు సంబంధించిన నిబంధనల ప్రకారం కేంద్రం దాఖలు చేసే పిటిషన్లను తీర్పు ఇచ్చిన అదే ధర్మాసనం చాంబర్లలో విచారణ జరుపుతుంది. కాగా, రాష్ట్రపతి నుంచి వచ్చే నివేదనలను ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతుంది. అయితే రాష్ట్రపతి అడిగిన అన్ని ప్రశ్నలను తిరస్కరించే అధికారం కూడా సుప్రీంకోర్టుకు ఉంది.

**రాష్ట్రపతి సంధించిన ప్రశ్నలు**

రాజ్యాంగంలోని 200 అధికరణ కింద తనకు సమర్పించిన బిల్లుపై గవర్నర్ ముందున్న రాజ్యాంగపరమైన ప్రత్యామ్నాయాలు ఏమిటి? తన వద్దకు బిల్లు వచ్చినపుడు రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 కింద తనకు గల అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటూనే మంత్రివర్గ సూచనలు, సలహాలకు గవర్నర్ కట్టుబడి ఉండాలా? రాజ్యాంగపరమైన విచక్షణాధికారాలను గవర్నర్ ఉపయోగించుకోవడం న్యాయ సమ్మతమా, కాదా? అంటూ ..రాష్ట్రపతి పలు ప్రశ్నలను సంధించారు.


### తీర్పులో ఏముంది?

ఏప్రిల్ 8న ఇచ్చిన తీర్పులో రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులపై చర్యలు తీసుకోవడానికి గవర్నర్‌కు గడువును నిర్దేశించిన సుప్రీంకోర్టు ఆర్టికల్ 200 కింద గవర్నర్ తన విచక్షణాధికారాలను ఉపయోగించాల్సిన అవసరం లేదని, రాష్ట్ర మంత్రివర్గం సూచనకు కట్టుబడి తప్పనిసరిగా బిల్లులపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. గవర్నర్ పంపిన బిల్లులను రాష్ట్రపతి పెండింగ్‌లో ఉంచితే సుప్రీంకోర్టును నేరుగా ఆశ్రయించాలని కూడా రాష్ట్ర ప్రభుత్వాలకు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం సూచించింది.

## అటవీ భూములపై సిట్

**రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశం**

న్యూఢిల్లీ: అటవీ భూముల సంరక్షణకు సంబంధించి సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. రిజర్వ్ ఫారెస్ట్ భూములను ఎవరైనా ప్రైవేటు వ్యక్తులకు, సంస్థలకు కేటాయించారా? వాటిని అటవీ సంరక్షణ కోసం కాకుండా ఇతర అవసరాల కోసం వినియోగిస్తున్నారా తేల్చాలని ఆదేశించింది. ఈ మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాల ద్వారా వివరాలు సేకరించి, అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకోవాలని తేల్చిచెప్పింది. ఈ ప్రక్రియ ఏడాదిలోగా పూర్తి చేయాలని ఆదేశించింది. పుణెలోని అటవీ భూమి అన్యాక్రాంతానికి సంబంధించిన కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని జస్టిస్ అగస్టీన్ జార్జ్, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సిట్‌లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులకు స్పష్టం చేసింది. పుణెలో అటవీ భూమిని అక్రమంగా ప్రైవేటు వ్యక్తుల వాణిజ్య అవసరాలకు కేటాయించిన ఉదంతం రాజకీయ నాయకులు, అధికారులు, బిల్డర్ల మధ్య సంబంధం ఎలా ఉందో చెప్పేందుకు పుణె కేసు ప్రత్యక్ష ఉదాహరణ అని పేర్కొంది.




## మస్క్ స్టార్‌లింక్‌కు పోటీగా అమెజాన్ 'ప్రాజెక్ట్ కైపర్'

న్యూఢిల్లీ: అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ సారథ్యంలోని 'ప్రాజెక్ట్ కైపర్' భారత్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నది. ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ ఇప్పటికే భారత ప్రభుత్వం నుంచి అనుమతి పొందగా, ప్రాజెక్ట్ కైపర్ ఇటీవలే భారత టెలి కమ్యూనికేషన్ విభాగానికి దరఖాస్తు చేసుకుంది. దీంతో ఉపగ్రహ ఇంటర్నెట్ రంగంలో పోటీ పెరగనుంది. భారత్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో అత్యంత వేగంగా ఇంటర్నెట్‌ను అందించడం, ఇంటర్నెట్ లేని ప్రాంతాలకు కూడా డిజిటల్ కనెక్టివిటీని అందించడమే 'ప్రాజెక్ట్ కైపర్' లక్ష్యం.

## మైండ్‌తో ఐఫోన్ కంట్రోల్!

**బ్రెయిన్-కంప్యూటర్ ఇంటర్‌ఫేస్‌పై యాపిల్ కసరత్తు**



న్యూఢిల్లీ: యాపిల్ ఐఫోన్ యూజర్లు తమ పరికరాలను తమ ఆలోచనలతోనే నియంత్రించగలిగే అవకాశం త్వరలోనే రాబోతున్నది. వినియోగదారుని మెదడులో అమర్చగలిగే ఓ డివైస్‌ను అభివృద్ధి చేయడం కోసం సింక్రోన్ అనే బ్రెయిన్-కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ కంపెనీతో యాపిల్ చేతులు కలిపింది. సింక్రోన్ తయారు చేసే డివైస్‌లో ఎలక్ట్రోడ్స్ ఉంటాయి. ఇవి మెదడు పంపించే సంకేతాలను చదవగలుగుతాయి. సింక్రోన్ అందజేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని యాపిల్ ఉపయోగించుకుని, సిగ్నల్స్‌ను యాక్షన్స్‌గా మార్చుతుంది. ఫలితంగా, ఐఫోన్‌ను ఉపయోగించే వ్యక్తి తనకు కావలసినదేమిటో మనసులోనే అనుకుంటే, ఆ పని జరిగిపోతుంది. ఫోన్‌లో ఏదైనా యాప్‌ను తెరవాలని కోరుకున్నపుడు, ఆ విషయాన్ని మనసులో అనుకుంటే, డివైస్ ఆ పని చేసేస్తుంది. టెక్నాలజీపై యాపిల్, సింక్రోన్ ప్రస్తుతం టెస్టర్స్‌తో ప్రయోగాలు చేస్తున్నాయి. నరాల సంబంధిత పక్షవాతం వంటి వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తి మెదడులో సింక్రోన్ కంపెనీ తయారు చేసిన స్టెంట్రోడ్ డివైస్‌ను అమర్చారు. ఇది స్టెంట్ మాదిరిగా ఉంటుంది. యాపిల్ ఐఫోన్లు, ఇతర డివైస్‌లలో ఈ బ్రెయిన్ 'స్టెంట్' అందుబాటులోకి వస్తే, దివ్యాంగులకు గొప్ప వరం అందినట్లే.




## ఎన్‌ఎల్‌యూ ప్రొఫెసర్‌గా జస్టిస్ చంద్రచూడ్

న్యూఢిల్లీ: ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ (ఎన్‌ఎల్‌యూ) ప్రొఫెసర్‌గా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ గురువారం నియమితులయ్యారు. భారతీయ న్యాయ విద్యలోఇదో వినూత్న అధ్యాయమని ఎన్‌ఎల్‌యూ ఈ సందర్భంగా ప్రకటించింది. జస్టిస్ చంద్రచూడ్ నియామకంతో తమ యూనివర్సిటీ విద్యా విధానం సుసంపన్నం కాగలదని ఎన్‌ఎల్‌యూ వైస్ చాన్సలర్ జీఎస్ బాజ్‌పాయ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ నియామకాన్ని పురస్కరించుకుని ఎన్‌ఎల్‌యూ రాజ్యాంగ అధ్యయన కేంద్రాన్ని నెలకొల్పనున్నది.